ముక్కు చివర "ముక్కుపుడక" ముఖానికి అందాన్నిచ్చింది. చెవులకు పెద్దసైజు రింగులున్నాయి. ఒంటి జడ పిరుదుల వరకూ వుంది. అది సవరమో సహజమో తెలీదు. కనకాంబరంపూలతో దవనాన్ని కలిపి జడలో పెట్టుకుంది. లేత గులాబీ చీర, అదే రంగు జాకెట్టు, మిగతావన్నీ ఒకటే రంగువి కావటం వలన ఆకర్షణీయంగా వుంది.

ఆ అమ్మాయిచ్చిన కాగితం చదివి ఆశ్చర్యపోయాను, నమ్మలేకపోయాను. ఆ అమ్మాయి పేరు గంగ. పెళ్ళయిన వెంటనే భర్త పోయేడట. వాళ్ళు నలుగురక్కచెల్లెళ్లట. మిగతా ముగ్గురూ కళ్ళూ, కాళ్ళూ లేనివాళ్ళట. దయ గల వాళ్ళందరూ ఆదుకోమని అందులో వ్రాసి వుంది. ఆ అమ్మాయి ఒక్కొక్కరి దగ్గరికెళ్ళి ఇచ్చిన కాగితం తీసుకుని 'ధర్మం చెయ్యండని' అడుగుతోంది. చాలా మంది తోచిందియిస్తున్నారు. అందరి దగ్గర డబ్బులు వసూల్చేసుకుని బస్సు దిగుతోంది ఆ అమ్మాయి.

క్రింద వున్న ముసలమ్మ అరుస్తోంది. "చూసారా బాబులూ! టిక్కుటిక్కులాడుకుని, అరువు సీర సింగారించి, షోగ్గా వచ్చి 'దరమం... బిచ్చం' అనొస్తే మా బాబులే దానందం, దాని గుండెత్తులూ చూసి ఓహ్ రూపాయిలిచ్చేరు. ఎయ్యండి ఎయ్యండి. ఏదో కాయితమ్ముక్క సూపించీసరికి ఐసయిపోయారు. తల్లులు... మరియాదగా ఎండనబడి గంటనించి అడుక్కుంటున్నానే, పైసాకి నేన్నోచుకోలేదా... పావలాలిచ్చేరే. దాని పనే బాగుంది. పగలడుక్కోడం... రేత్రి బిజినెస్సు, నంజల మాటలే నమ్మద్దీ లోకం. సంసారి మాట లెవిడిక్కావాలి".

ఒంటికాలిమీద నిలబడి, బీటు కానిస్టేబుల్ ఫోజిచ్చి కళ్ళు చిత్రంగా తిప్పుతూ, చేతులు వూపుతూ కేకలేస్తోంది ముసిల్ది.

"ఏవన్నావ్.... నేన్నంజనా" ఇంతసేపూ సౌమ్యంగా మమ్మల్నడిగిన అమ్మాయి కిందకు దిగుతూ గొంతుపెంచి అన్నది.

"నంజవా... మరి నంజవా... సెతకారీ నంజవి. దగుల్బాజీ నంజవి... పడుసుకునే నంజవి... పత్తిత్తునంజవి... పొద్దున్నొకడితో..మద్దేనవింకొకడితో... సాయంత్రవింకొకడితో... రాత్రి వొకడితో కులికే సానినంజవి. నీ ఏసాలు నాకెరికనేదా. నేనడుక్కుంటున్న దగ్గరికల్లా వస్తావు. నా డబ్బులట్టుకెళ్ళిపోతావు. సవత్కాకి నంజా. నా నోట్లో నోరెట్టక" నోరంతా చాపి అరిచింది ముసిల్ది.

"మాటలు సరిగ్గా రానీయ్ ముసిలీ... కీలిరిగిపోగల్దు. తన్నేనంటే హౌరాబ్రిడ్జీ కాడకెళ్ళిపోగలవు" అన్నాదా అమ్మాయి.

